


ఇది నిజంగా జరిగిన కథ. రచయిత ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకి సుపరిచితులయిన 'యు' — ఒక రిటైరయిన పోలీసు అధికారి. కథలోని పేర్లు మాత్రం మారుపేర్లు.

—సం॥

ఇది సుమారు నలభయిఏళ్ల కిందటి మాట. అది రామనాడు జిల్లాలో ఒక మారుమూలగ్రామం. ఆ గ్రామంలో జయలక్ష్మి అనే అమ్మాయి ఉండేది. జయలక్ష్మికి తన విధవతల్లి తప్ప వేరెవరూ లేరు. ఈ తల్లే పొలాలలో కూలిపనిచేసి ఇద్దరికీ చాలీచాలని సంపాదనకి ఆధారంగా ఉండేది.

జయలక్ష్మి అందగత్తె. కాని, ఆమె బుద్ధి కాస్త మందంగా ఉండేదని అందరూ అనుకునేవారు. దీనికి తోడు పట్టి గయ్యాళి రకం. అసలే చదువు రాక పోవటం, పేదరికంవల్ల ఆమెకి త్వరగా పెళ్ళి కుదరలేదు...

ఇలా ఉండగా ఒకనాడు ఆమెకొక సంబంధం వచ్చింది. మధుర జిల్లాలో చిన్నప్పుడే తల్లిదండ్రులని పోగొట్టుకున్న ఒక యువకుడు ఆమెని చూడటానికి వచ్చాడు. అతని పేరు మురుగన్. మురుగన్ కాస్త కలవాడు. జయలక్ష్మి అందాన్ని చూసి ముగ్ధుడయ్యాడు. కొందరు వద్దని సలహా ఇచ్చినా ఆమెనే పెళ్ళిచేసుకొనటానికి నిశ్చయించుకున్నాడు.

పెళ్ళి అయిపోయింది. జయలక్ష్మి భర్తతో పక్కజిల్లాకి వెళ్ళిపోయింది, ఆమె రాకతో మురుగన్ మనశ్శాంతి కాస్తా పోయింది! జయలక్ష్మి మాట దురుసుతనం అటువంటిది...

* * *

కొన్ని సంవత్సరాలు గడిచాయి. మధుర, రామనాడు జిల్లాలలో అనావృష్టిబాధ విపరీతం అయిపోయింది. మురుగన్ పొలాలు ఎండిపోయాయి. అతను బాగా నష్టపోయాడు. ఈ నష్టంతోబాటు పెళ్ళాము సాధింపు కూడా అధికం అయింది. ఇక ఆమెతో వేగలేక అత్తగారితోసహా పుట్టిన ఊరికి పంపించివేసి తను బర్మాకి వెళ్ళిపోయాడు. ఆ రోజులలో అది ఎందరోచేసే పనే ...

మురుగన్ గ్రామంలో అతన్ని పోలిన మనిషి మరొకడు ఉండేవాడు. అతని పేరు ముత్తయ్యన్. ముత్తయ్యన్ చిన్నప్పటినుంచి చెడుదారి తొక్కిన వ్యక్తి. చిన్నచిన్న దొంగతనాలను ప్రారంభించి పెద్ద గజదొంగగా మారిపోయాడు. తరుచు కారాగృహానికి వెళ్ళి వస్తూవుండేవాడు. కాని, ముత్తయ్యన్ జాగ్రత్తమనిషి. తను దొంగిలించిన సామాను చాలా తీసుకువెళ్ళి జయలక్ష్మి భర్త మురుగన్ పాడుబడిన ఇంట్లో పాతి పెట్టేవాడు!

ఒకనాడు ముత్తయ్యన్‌కి తన దొంగబతుకుని అపుదామనిపించింది. 'ఎంతకాలమని పోలీసులని తప్పించుకుని తిరగటం!' అనుకున్నాడు.

ఒక పథకం తయారుచేశాడు.

జయలక్ష్మి ఊరికి వెళ్ళాడు. తనే

బర్మా నుంచి తిరిగి వచ్చిన మురుగన్‌ని అన్నాడు. బర్మాలో ఎంతో సంపాదించాననే ప్రచారం చేశాడు! జయలక్ష్మి తెలివి తక్కువది. ఈ దొంగ మురుగన్ ప్రచారాన్ని నమ్మింది. ఆమె తల్లి ముదుసలి కాబట్టి చూపు సరిగ్గా లేక నిజం కాబోలు ననుకుంది. తక్కినవారు మురుగన్‌ని బాగా ఎరగరు కాబట్టి పూర్తిగా నమ్మేశారు! ముత్తయ్యన్ లేక మురుగన్ ఆ గ్రామంలోనే స్థిరపడి పోతున్నానన్నాడు. కొంత భూమి, ఒక ఇల్లు కొన్నాడు...

అయితే అతనికి జయలక్ష్మి స్వభావం ఎటువంటిదో తెలిసి వచ్చింది. ఆమె గయ్యాళితనాన్ని తట్టుకోలేక పోయాడు. చివరికి ఎదురుతిరిగి ఆమెని కొట్టటం మొదలు పెట్టాడు. దానితో జయలక్ష్మికి ఒక అనుమానం కలిగింది. తన భర్త మురుగన్ ఇంత కఠినుడని ఆమె నమ్మలేక పోయింది. తన అనుమానాన్ని కాస్త బయట పెట్టింది. ఊర్లో పుకార్లకి అంతులేదు...

ఇలా ఉండగా ఆ ఊరికి ఒక ముష్టివాడువచ్చాడు. చింపిరిజుట్టుతో, పేలికలయిన గుడ్డలతో వాచినకాళ్ళతో ఎంతో బలహీనంగాఉన్నాడు. అతన్ని చూడగానే జయలక్ష్మి మనస్సులో ఏదో మెదిలింది. ఆ ముష్టివాడిని తన ఇంటికి పిలిచి అన్నం పెట్టింది. అతనితో ఎంతోసేపు మాట్లాడింది...

అతనెవరోకాదు. జయలక్ష్మి మొదటి మొగుడు మురుగన్!

మురుగన్ బర్మాకివెళ్ళి వ్యాపారం పెట్టాడు. త్వరలోనే మంచి ఆస్తి సంపాదించాడు. ఒక బర్మా వనితని పెళ్ళిచేసుకున్నాడు. అక్కడే స్థిరపడిపోవటానికి నిశ్చయించుకున్నాడు. కాని, రెండవ ప్రపంచయుద్ధం మొదలయి జపాన్ బర్మా మీదకి దాడితీసింది. మురుగన్ తన ఆస్తినంతా పోగొట్టుకుని భారతదేశానికి తిరిగి వెళ్ళిపోవటానికి ఉద్యుక్తుడయ్యాడు.

అతనివెంట రావటానికి మురుగన్‌బర్మా భార్య అంగీకరించలేదు. సరేననుకుని అతను ఒంటరిగా స్వదేశానికి నడక ప్రారంభించాడు. వెయ్యిమైళ్ళ కాలినడక తర్వాత చిక్కిశల్యమయి అస్సామ్ చేరుకున్నాడు. కాందిశీకుడు కాబట్టి భారత ప్రభుత్వం అతనికి సహాయంచేసింది. అనామకుడుగానే స్వగ్రామం చేరుకున్నాడు. అక్కడినుంచి భార్య ఊరికివెళ్ళాడు. పరిస్థితిని అర్థం చేసుకున్నాడు.

జయలక్ష్మి తల్లి ఊరివారిని కొందరిని సహాయంచెయ్యమని కోరింది. వారు పోలీసులకి రిపోర్టు ఇచ్చారు.

ఒక పెద్ద దొంగపట్టుబడిపోయాడు. ఈ అనుభవం తర్వాత జయలక్ష్మికూడా భర్తవద్ద కొంత నెమ్మదిపడటం అలవాటు చేసుకుంది !

